క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ. 2 లక్షల విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి తిరుపతికి చెందిన భక్తులు మంగళవారం రూ.2 లక్షల విరాళం సమర్పించారు. తిరుపతి తిలక్ రోడ్డుకు చెందిన లక్కాకుల పరంధామయ్య పేరిట రూ.1,00,016, లక్కాకుల కిశోర్ రూ.1,00,016 విరాళాలను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం కుటుంబ సమేతంగా దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా వాకర్స్ దినోత్సవం



ప్రకాశం పార్క్‌లో వాకర్స్‌డే వేడుకలు

తిరుపతి కల్చరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో తిరుపతిలోని వివిధ పార్క్‌లతోపాటు మంగళం రోడ్డులోని పేద విద్యార్థుల శిక్షణాకేంద్రంలో మంగళవారం వాకర్స్ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఏర్పాటుకు కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి ఆళ్వార్ దాస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. శిక్షణా కేంద్రం నిర్వాహకుడు వెంకటేశ్వర్లు, ప్రకాశం మున్సిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి గోపి నాయుడు, కోశాధికారి జగన్నాథం, జగ్జీవన్‌రామ్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయగిరి రఘు, దయానంద్, వాకర్స్ పాల్గొన్నారు.

త్వరితగతిన లక్ష్మీపురం కూడలి అభివృద్ధి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ

తిరుపతి తుడా: లక్ష్మీపురం కూడలిలో డ్రైనేజీ, రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ అధికారులను ఆదేశించారు. 13వ డివిజన్ కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, డీఈ సంజయ్ కుమార్‌తో కలిసి ఆయన మంగళవారం అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కౌన్సిల్లో తీసుకున్న నిర్ణయం మేరకు డ్రైనేజీ, వర్షపు నీటి ప్రవాహ దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారంగా చర్యలు చేపట్టామన్నారు. పటిష్టమైన డ్రైనేజీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఆధునికంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదేశించారని చెప్పారు.

రైల్వేస్టేషన్‌లో విజిలెన్స్ వారోత్సవాలు



విజిలెన్స్ వారోత్సవాల్లో రైల్వే అధికారులు

తిరుపతి అర్బన్: రైల్వే స్టేషన్‌లో మంగళవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ నుంచి పార్సిల్ కార్యాలయం వరకు ఇంటెగ్రిటీ వాకథాన్ నిర్వహించారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, రైల్వే సీఈ మధుసూదన్ రావు, స్టేషన్ మాస్టర్ చిన్నప్పరెడ్డి పాల్గొన్నారు.

సత్తా చాటిన రైల్వే మజ్దూర్ యూనియన్

తిరుపతి అర్బన్: ఈ నెల 19వ తేదీన నిర్వహించిన సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో రైల్వే మజ్దూర్ యూనియన్ సత్తా చాటిందని ఆ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు సుదర్శన్‌రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు డివిజన్ స్థాయిలో 28 మంది డెలిగేట్లకు 28 మంది గెలుపొందారని వెల్లడించారు. ప్రధానంగా తిరుపతి నుంచి పోటీ చేసిన రవీంద్రనాయక్, రేణిగుంట నుంచి రాజేష్, సీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన నరేంద్రకుమార్, అరుణ్‌కుమార్, రాజంపేట నుంచి బరిలో దిగిన వినోద్‌కుమార్ విజయం సాధించినట్లు చెప్పారు.

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

తిరుపతి తుడా: తిరుపతి నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషన్ హరిత తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా పై రెవెన్యూ, బూత్ లెవెల్ ఆఫీసర్లతో మంగళవారం ఆమె స్థానిక ఆడిటోరియంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఓటర్ నమోదు అధికారి హరిత మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గం ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024 ముసాయిదా ఓటర్ల జాబితాను రూపొందించినట్లు తెలిపారు. 257 పోలింగ్ కేంద్రాలు ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత ముసాయిదా జాబితాను రూపొందించామన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళులు



నివాళులు అర్పిస్తున్న డీన్ ప్రభాకర్‌రెడ్డి



సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఎస్వీ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఎస్వీ యూనివర్సిటీ వీసీ రాజారెడ్డి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు.

తిరుపతి గాంధీ రోడ్డు: దేశ సమైక్యతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి మరువలేనిదని బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన జయంతి సందర్భంగా ఆ పార్టీ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. బీజేపీ నాయకులు విజయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం యాదవ్, దీపక్ యాదవ్, హరినాథ్, రెడ్డప్ప, కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

పాకాల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో, ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని విద్యార్థులకు గుర్తు చేశారు. అనంతరం సమైక్యతా ప్రయోజనాలను వివరిస్తూ విద్యార్థులతో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సురేంద్ర, ఎన్ఎస్ఎస్ పీఓ మాసిలామణి, అధ్యాపకులు రమేష్‌కుమార్, ఈశ్వర్‌బాబు, చిట్టికళావతి, రమణమ్మ, వినోద్, లక్ష్మీప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో...

మండలంలోని మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం సుమలత ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో సమైక్యతా ప్రతిజ్ఞ చయించారు. ఉపాధ్యాయుడు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాధికారి వెంకటనారాయణ

- రూరల్ ఎంపీడీఓకు తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రశంసలు
- వైఎస్ఆర్ కడప జిల్లా డ్వామా డీవీఓగా బదిలీ



పదోన్నతిపై వెళ్తున్న వెంకటనారాయణను ఘనంగా సత్కరిస్తున్న తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: నిత్యం ప్రజల సంక్షేమం కోసం తపించే ప్రజా సంక్షేమాధికారి తిరుపతి రూరల్ ఎంపీడీఓ డాక్టర్ వెంకటనారాయణ అని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. ఎంపీడీఓ నుంచి డీఎల్‌డీఓగా పదోన్నతి పొంది, వైఎస్ఆర్ కడప డ్వామా విజిలెన్స్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్తున్న వెంకటనారాయణకు మంగళవారం రూరల్ మండల కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. రెండున్నరేళ్ల పాటు మండలంలో ఎంపీడీఓగా విశేష సేవలు అందించారని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. ఈ వీడ్కోలు సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో మండలంలో కోట్లాది నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను అధికారుల సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేసిన పరిపాలనదక్షుడు వెంకటనారాయణ అని తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రోత్సాహం, ఎంపీపీ మోహిత్‌రెడ్డి సహకారం, ఉద్యోగులు, సిబ్బంది అండతోనే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులను గ్రామ గ్రామాన పూర్తి చేసినట్లు ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. అనంతరం గజమాలతో ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, సిబ్బంది డాక్టర్ వెంకటనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, వైస్ ఎంపీపీలు వేముల యశోద, విడుదల మాధవరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ అభివృద్ధి పనులు వేగవంతం

- ఛైర్మన్, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి
- వచ్చే జూన్ నాటికి 25 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- మేనేజింగ్ డైరెక్టర్ డి హరిత



వరాలు వెల్లడిస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ హరిత

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని స్మార్ట్ సిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్మార్ట్ సిటీ డైరెక్టర్లు, సంబంధిత శాఖ అధికారులతో అభివృద్ధి పనులపై మంగళవారం సమీక్షించారు. వర్చువల్ విధానంలో పాల్గొన్న స్మార్ట్ సిటీ ఛైర్మన్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో జరుగుతున్న స్మార్ట్ ప్రాజెక్టుల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు చొరవ తీసుకోవాలని చెప్పారు. నిధులు ఎప్పటికప్పుడు రాబట్టేందుకు తగిన సమాచారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాయాలని ఆయన సూచించారు. తొలుత మేనేజింగ్ డైరెక్టర్ హరిత మాట్లాడుతూ స్మార్ట్ సిటీలో భాగంగా ప్రస్తుతం 25 ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇందులో సగానికి పైగా అభివృద్ధి ప్రాజెక్టులు 95 శాతం పనులు పూర్తి చేసుకున్నాయన్నారు. వీటిని పూర్తి చేసి త్వరలో ప్రారంభానికి సిద్ధం చేస్తామని అన్నారు. అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి సమాచారాన్ని డైరెక్టర్లకు ఆమె వివరించారు. ఇందులో టీటీడీ జేఈవో సదా భార్గవి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, తుడా వైస్ ఛైర్మన్ హరికృష్ణ, స్మార్ట్ సిటీ మిషన్ అండర్ సెక్రటరీ విజయకుమార్, ఇండిపెండెంట్ డైరెక్టర్లు డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ రమాశ్రీ, జనరల్ మేనేజర్ చంద్రమౌళి, ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దొరస్వామి నాయుడు ఆకస్మిక మృతి

- నివాళులర్పించిన తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన దొర ప్లాస్టిక్స్ సంస్థ అధినేత కేశవులునాయుడు తండ్రి దొరస్వామి నాయుడు ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి మంగళవారం దొరస్వామి నాయుడు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వేడుకగా రథోత్సవం

చంద్రగిరి: తొండవాడ స్వర్ణముఖీ నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్తేశ్వరస్వామి(ముక్కోటి)వారి ఆలయంలో వారం రోజులుగా రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఆలయ పరివార దేవతలైన శ్రీరామచంద్రమూర్తి, శ్రీవేణుగోపాల స్వాములకు అభిషేక సేవను నిర్వహించారు. అనంతరం ఆలయంలో కొలువైన ఆది దంపతులను రథంపై ఆశీనులు చేసి రథోత్సవ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం రాత్రి కామధేను వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పూలంగి సేవ

ఉద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పూలంగి సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు మూషిక వాహనంపై వినాయకుడి ఊరేగింపు, 10.30గంటలకు పూలంగి సేవ, రాత్రి 7 గంటలకు అధికార నంది వాహనంపై స్వామి, అమ్మవార్లు భక్తులను అనుగ్రహించనున్నారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడి అభయం

చంద్రగిరి: బంగారు తిరుచ్చిపై రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం శ్రీకృష్ణ స్వామివారి జన్మనక్షత్రమైన రోహిణి సందర్భంగా శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేక సేవ చేపట్టి, స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలకరించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకర శోభితులైన స్వామి, అమ్మవార్లు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ



వరుడి కుటుంబ సభ్యులకు పెళ్లికానుక అందిస్తున్న నాయకులు

చంద్రగిరి: ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందజేసిన ఎమ్మెల్యే వివాహ కానుకను వైఎస్ఆర్ సీపీ నాయకులు వధూవరులకు అందజేశారు. మంగళవారం స్థానిక బీడీ కాలనీకి చెందిన షేక్ షాహిద్, నూర్-ఇ-చష్మిలకు వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా చంద్రగిరి డివిజన్ వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి నాయకులతో కలసి నూతన వధూవరులకు బంగారు నల్లపూసల దండ, పట్టువస్త్రాలు, స్వీట్లు, వెండి మెట్టెలతో కూడిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, ముదికుప్పం రామ్మూర్తి, కొత్తపాటి కోటి, సోను, అంగేరి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు జరిమానా

తిరుపతి లీగల్: తిరుమలకు వెళ్లేదారిలో ఆర్టీసీ బస్సును నిర్లక్ష్యంగా నడిపి వేరొక వాహనానికి నష్టం కలిగించిన కేసులో ఎస్ఆర్‌పురానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎస్.రవికుమార్‌కు రూ.1000 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వర రావు మంగళవారం తీర్పు చెప్పారు. ఈ ఏడాది జూన్ 6వ తేదీ ప్రమాదం జరగగా తిరుమల ట్రాఫిక్ పోలీసులు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. మద్యం తాగి తిరుమలకు వెళ్లిన ఇద్దరు వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పల్లెల్లో నిరంతర విద్యుత్ వెలుగులు

- ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డి
- పేరూరు సబ్‌స్టేషన్‌లో ఘనంగా ఆయుధ పూజ



కార్మికులకు నూతన వస్త్రాలను అందిస్తున్న రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి

తిరుపతి రూరల్: విద్యుత్ అంతరాయం లేకుండా పల్లెలకు నిరంతర వెలుగులను అందిస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ పేరూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఆయుధపూజ నిర్వహించారు. ఏఈ రజనీకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యుత్ కార్మికులకు నూతన వస్త్రాలను అందించారు. జిల్లాలో విద్యుత్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎస్పీడీసీఎల్ తిరుపతి రూరల్ డివిజన్ ఈఈ వాసురెడ్డి, ఈఈలు శ్రీనివాసులు, వాసుదేవరెడ్డి, డీఈ శేషాద్రిరెడ్డి, ఏఈ రజనీకుమార్, పేరూరు, విద్యానగర్, పెరుమాళ్లపల్లి సెక్షన్ల సిబ్బంది పాల్గొన్నారు.

9న విద్యుత్ అదాలత్



ఈఈ వాసుదేవరెడ్డి

తిరుపతి రూరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) పరిధిలోని తిరుపతి టౌన్ డివిజన్‌లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ వాసుదేవరెడ్డి తెలిపారు. మంగళవారం తిరుపతిలోని ఈఈ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీఎస్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) ఛైర్ పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. పాత తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణమ్మ ఆలయం సమీపంలో ఉన్న ఎస్పీడీసీఎల్ తిరుపతి టౌన్ డివిజన్ కార్యాలయంలో ఈనెల 9వ తేదీ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

రక్తదానంతో ప్రాణాలు నిలబెట్టండి



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: రక్తదానంతో ప్రాణాలు నిలబెట్టాలని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఆచార్య భారతి తెలిపారు. మహిళా వర్సిటీ డీన్ స్టూడెంట్స్ అఫైర్స్, ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో రుయా బ్లడ్ బ్యాంక్, తిరుపతి సెంట్రల్ టాక్స్ విభాగం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహకారంతో మంగళవారం ఆరోగ్య కేంద్రం వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ భారతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రక్తదానంపై అవగాహన పెంచుకొని ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదుకోవాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం 30 మంది విద్యార్థినులు, సిబ్బంది రక్తదానం చేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రజిని, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆచార్య కాత్యాయని, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనన్య, సెంట్రల్ టాక్స్ కార్యాలయం సిబ్బంది, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక కోర్టు న్యాయమూర్తికి సన్మానం



న్యాయమూర్తి నాగరాజును సన్మానిస్తున్న వై.వీర్రాజు

తిరుపతి లీగల్: ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నాగరాజు మంగళవారం పదవీ విరమణ సందర్భంగా టీటీడీ న్యాయాధికారి వై.వీర్రాజు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నాగరాజు సేవలను టీటీడీ న్యాయాధికారి వీర్రాజు కొనియాడారు. నాగరాజు న్యాయ వ్యవస్థకు విశిష్ట సేవలందించారని వీర్రాజు ప్రశంసించారు. తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి టి.రామచంద్రుడు మాట్లాడుతూ న్యాయవ్యవస్థకు నాగరాజు విశిష్టమైన స్థానం తీసుకొచ్చారని అన్నారు. టీటీడీ సహాయ న్యాయాధికారి పాదిరి యుగంధర్‌రెడ్డి ప్రసంగిస్తూ న్యాయవ్యవస్థ గౌరవాన్ని నాగరాజు పెంపొందించారని కొనియాడారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

రామచంద్రాపురం: మండలంలోని సీకాలేపల్లి యూనిట్ పరిధిలోని చిట్టత్తూరు, గొల్లపల్లి, నెత్తకుప్పం గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగంతో కలసి రైతు సాధికార సంస్థ రాయలసీమ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ మంగళవారం సందర్శించారు. విత్తన గుళికలు తయారీ విధానాన్ని, 15 రకాల మిశ్రమ పంటల విధానం, బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, కషాయాల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎస్ఆర్పీ భానుమూర్తి, అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన భవనాల ఏర్పాటుకు సహకరించండి



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలో నూతన భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కోరినట్లు న్యాయవాదులు నెల్లూరు యోగానంద్, ఎస్.రాజారెడ్డి తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయంలో ఆయన్ను కలిశామన్నారు. వారు మాట్లాడుతూ భవనాల ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తిరుపతిలో న్యాయవాదుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారని పేర్కొన్నారు. న్యాయవాదులు ఎస్.శ్రీహరి, కోటేశ్వర ప్రసాద్, మదన్‌మోహన్‌రెడ్డి, ఉన్నారు.